# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే


మెదక్ చర్చిలోకి శిలువను తీసుకెళ్తున్న భక్తులు


మెదక్ చర్చిలో శిలువకు ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు


చేగుంట: వడియారం సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- కిటకిటలాడిన మెదక్ మహా దేవాలయం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 29: జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్ 'ఫ్రై డే' నిర్వహించుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం శిలువను ఊరేగించిన మధ్యాహ్నం వరకు ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు. లోక పాపములను పోగొట్టుటకు శిలువ ఎక్కాడు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవసందేశం వినిపించారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా ఏసయ్య భక్తి గీతాలు ఆలపించారు. మెదక్ డయాసిస్ పరిధిలోని పలు జిల్లాల నుంచి క్రైస్తవులు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంతం కిటకిటలాడింది. ప్రార్థనల్లో పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, సువర్ణ, జైపాల్, సంఘ పెద్దలు గంట సంపత్, జాన్సన్, సంశాన్ సందీప్, గెలెన్ చిత్తరంజన్, సునీల్, సువన్‌డగ్లస్, జాయ్‌ముర్రే తదితరులు పాల్గొన్నారు.

**చేగుంటలో..**


చేగుంట, మార్చి 29: చేగుంట, నార్సింగి మండలాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడియారంలో ఉన్న సీఎస్ఐలో పాస్టర్ రేవ విజయకుమార్, రవీంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, మార్చి 29: మండల వ్యాప్తంగా చర్చిలలో శుక్రవారం పాస్టర్లు, క్రైస్తవులు గుడ్ ఫ్రై డే వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నిజాంపేటలోని చర్చిలో పాస్టర్ క్రాంతిరాజు క్రైస్తవులకు క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు. చర్చి ప్రాంగణమంతా యేసుక్రీస్తు పాటలతో మార్మోగింది.


నిజాంపేటలో చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాస్టర్ క్రాంతిరాజు, క్రైస్తవులు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలొచ్చాయి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

అందోల్, మార్చి 29 : కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తెలంగాణ ప్రజలకు కరెంట్ కష్టాలొచ్చాయని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం జోగిపేటలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి ప్రభుత్వ ఖజానా ద్వారా ఖర్చు పెట్టలేదని, కార్పొరేషన్ల ద్వారా చేస్తున్నదని విమర్శించారు. వ్యయం, ఖర్చులపై సరైన అవగాహన లేని పాలకులు ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయరన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు అండగా ఉండాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్వప్రయోజనాల కోసం పని చేస్తారని, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ స్థానికుడు, ఉద్యమకారుడు అని, మనకు అండగా ఉంటారని పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు.

## దుబ్బాక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు


దుబ్బాక సమావేశానికి వెళ్తున్న చేగుంట నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట, మార్చి 29 : దుబ్బాకలో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి చేగుంట మండలం నుంచి గులాబీ శ్రేణులు తరలి వెళ్లారు. సమావేశానికి వెళ్లినవారిలో జడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, మంచికట్ల శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, రాజిరెడ్డి, పట్నం తానీషా, సిద్ధిరాములు, యాటస్వామి, వడ్డెపల్లి నర్సింహులు, ఆలీ, ఆశోక్‌రెడ్డి, శివ, లక్ష్మణ్, నరేశ్, రమేశ్ ఉన్నారు.

## వెల్దుర్తిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందుకు హాజరైన పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 29 : మండలకేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు అవుసుల మల్లేశం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందుకు పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి హాజరయ్యారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు శంకరయ్యగౌడ్, కృష్ణతోపాటు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వమే ఉండాలి

- రాష్ట్రంలో 17 స్థానాలు గెలిచి ప్రధాని మోదీకి కానుకగా ఇస్తాం
- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
- పార్లమెంట్ ఎన్నికలు ఏకపక్షమే..
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్, మార్చి 29 (నమస్తే తెలంగాణ)/రామాయంపేట: గల్లీలో ఏపార్టీ ఉన్నా ఢిల్లీలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉండాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని శారదా ఫంక్షన్ హాల్లో బీజేపీ పార్లమెంటరీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో, మెదక్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలు గెలిచి ప్రధాని నరేంద్ర మోదీకి కానుకగా ఇస్తామన్నారు. కచ్చితంగా ఈ సారి తెలంగాణలో బీజేపీ ఘన విజయం ఖాయమన్నారు. ప్రజలంతా ప్రస్తుతం ఇదే కోరుకుంటున్నారన్నారు. తెలంగాణకు అత్యధిక నిధులు తెచ్చి బాగు చేస్తామన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాని పనులను ఐదేండ్లలో చేసి చూపెడుతామన్నారు. ఎంపీగా గెలిపిస్తే మెదక్ ఆత్మ గౌరవాన్ని నిలబెడుతానన్నారు. మెదక్ పార్లమెంటు ఎన్నిక ఏకపక్షంగానే ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా సాగవన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే అధోగతి పాలవుతామన్నారు.

**మెదక్ ప్రజల శ్వాసగా పనిచేస్తా..**

మెదక్ ప్రజల ఆశ, శ్వాసగా పనిచేస్తామని రఘునందన్ రావు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా చేయలేని పనులను ఐదేండ్లలో మోదీ చేసి చూపించారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పార్లమెంటు ఇన్‌చార్జి సంగమేశ్వర్, పట్టణాధ్యక్షుడు నాయిని ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రాగౌడ్, రామాయంపేట మండల అధ్యక్షుడు దయానంద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భానుచందర్, నాయకులు పంజా విజయ్‌కుమార్, నందారెడ్డి, బెండ వీణ, ఎంఎల్ఎన్ రెడ్డి, సతీశ్, ఎక్కాలదేవ్ మధు, రాగి రాములు, సంగమేశ్వర్‌గౌడ్, శేఖర్, సిద్ధరాములు, రమేశ్, కన్నయ్య, లింగం, వినయ్ పాల్గొన్నారు.

**పాపన్నపేటలో..**

పాపన్నపేట, మార్చి29: పాపన్నపేటలో బీజేపీ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, మండలాధ్యక్షుడు బీకొండ రాములు, నాయకులు సత్యం, సంతోష్‌చారి, నరేశ్, సుంకరి కిష్టయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, మార్చి 29: కాంగ్రెస్ హామీలు అమలుచేయకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఏం ముఖం పెట్టకొని ఓట్లు అడుగుతారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. సమావేశంలో మండలాధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, నాయకులు నందారెడ్డి, మల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాములోరి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం


రామాయంపేట శిశుమందిర్‌లో గోటితో వడ్లను ఒలుస్తున్న మహిళా భక్తులు

రామాయంపేట, మార్చి 29: పట్టణంలోని అశోక్‌సింఘాల్ శిశుమందిర్ వార్షికోత్సవాల్లో భాగంగా గజ్వేల్ ప్రాంతానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం శుక్రవారం పాల్గొన్నారు. ఏప్రిల్ 17న భద్రాచలం రామాలయంలో నిర్వహించనున్న రాములవారి కల్యాణా నికి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. వడ్లను ఒలిచిన అక్షింతలను భద్రాచలానికి తీసుకెళ్తున్నట్లు రామకోటి భక్త సమాజం భక్తులు తెలిపారు. ఈ మేరకు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో మహిళలు వడ్లను ఒలిచి తలాంబ్రాలను సిద్ధం చేశారు. ఉత్సవాల్లో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలకు మాజీ ఎమ్మెల్యే దూరం



నర్సాపూర్, మార్చి 29 : పుట్టినరోజు, పెళ్లి రోజు వేడుకలకు ఈసారి దూరంగా ఉంటున్నానని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల తన సోదరుడి కుమారుడు మృతి చెందడంతో శనివారం పుట్టిన రోజు, ఆదివారం పెళ్లిరోజు వేడుకలు నిర్వహించుకోవడం లేదని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేయడానికి తన వద్దకు రావద్దని, ఆ రోజు అందుబాటులో ఉండడం లేదని పేర్కొన్నారు.

## రేపటిలోగా పన్నులు చెల్లించాలి

రామాయంపేట, మార్చి 29: మున్సిపాలిటీలో పన్ను వసూళ్లు జోరందుకున్నాయి. రూ.1.46కోట్ల పన్ను లక్ష్యాన్ని చేరడానికి మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో తిరుగుతూ పన్నులను వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు రామాయంపేట మున్సిపల్‌లో రూ. 95లక్షలను వసూలు చేశారు. ఈనెల 31 లోగా పన్నులు చెల్లించి, ప్రభుత్వ రాయితీ పొందాలని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ సూచించారు. వంద శాతం పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకుంటామని సిబ్బంది పేర్కొంటున్నారు. కంప్యూటర్‌తోనే పన్నులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. పన్నులపై ఎలాంటి సందేహాలు ఉన్నా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## చెన్నాయపల్లి చెరువు నీటిని వదలాలి

చిన్నశంకరంపేట, మార్చి 29: మండలంలోని చెన్నాయపల్లిలో వరి పంట ఎండిపోతున్నది. నల్లచెరువులోని నీళ్లు వదిలి పంటలను కాపాడాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. శాలిపేట, చెన్నాయపల్లి శివారులను కలుపుతూ నల్లచెరువు ఉన్నది. చెరువులోని నీటిని శాలిపేటకు చెందిన రైతులు అధికారులకు సమాచారం ఇవ్వకుండా పొలాలకు తరలించుకుంటున్నారని రైతులు ఆరోపించారు. వరి పొట్ట దశలో ఉందని, పంటలు ఎండి పోతున్నాయని నీళ్లు వదలానని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి, చెరువు నీటిని విడుదల చేసి, పంటలు కాపాడాలని చెన్నాయపల్లి రైతులు కోరుతున్నారు.

## నీలం మధు గెలుపు ఖాయం


మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు శుభాకాంక్షలు తెలుపుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తొగుట, మార్చి 29 : కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు గెలుపు ఖాయమని దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి నీలం మధు శుక్రవారం ఆయనను అతని ఇంటిలో కలిశారు. తనకు మద్దతు తెలిపి విజయం అందించాలని నీలం మధు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేశామని, బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంట్, పేదలకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా వంటి పథకాలను ప్రజలు గుర్తించి తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే దుబ్బాక నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. నీలం మధును కలిసిన వారిలో తొగుట ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వెంగళ్‌రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## ఇంటింటి సర్వే


కేసీఆర్ కాలనీలో సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రామాయంపేట, మార్చి 29 : మున్సిపాలిటీలోని కేసీఆర్ కాలనీలో జన గణన సర్వే కొనసాగుతున్నది. శుక్రవారం అంగ్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లను తీసుకుని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కాలనీలో 250 ఇండ్లలో సుమారు వెయ్యి మందికిపైగా ఉన్న జనాభాను సర్వే చేశారు. సర్వేకు అందుబాటులోని వారు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరాలు అందజేయాలని సూచించారు. సర్వేలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజన ఉన్నారు.

## మహిళ అదృశ్యం

అమీన్‌పూర్, మార్చి 29: భార్యాభర్తలు గొడవపడి ఘటనలో భార్య ఇంటి నుంచి వెళ్లి, అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఎస్సై తెలిపిన వివరాలు.. ఈ నెల 27న కిష్టారెడ్డిపేటకు చెందిన సుజాత (28) భర్త శ్రీనివాస్‌తో గొడవపడింది. దీంతో మనస్తాపం చెందిన సుజాత తన కూతురు గౌతమినీ వెంటబెట్టుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికీ రాకపోయేసరికి భర్త శ్రీనివాస్ పలుచోట్ల వెతికిన అచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లయ్య తెలిపారు.

## తల్లీకూతురు అదృశ్యం

అమీన్‌పూర్, మార్చి 29: భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భార్య కూతురితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... అమీన్‌పూర్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసించే శ్రీనివాస్, పద్మావతి భార్యాభర్తలు. వీరికి నాలుగేండ్ల కూతురు రియా ఉంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. కాగా శుక్రవారం పద్మావతి, కూతురు రియాను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాస్ తనకు తెలిసిన బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీనివాస్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శ్రీ చైతన్య స్కూల్‌కు తాళం వేసిన అధికారులు

చేర్యాల, మార్చి 29 : మున్సిపాలిటీలోని శ్రీచైతన్య స్కూల్ నిర్వాహకులు ఆస్తి పన్ను బకాయి ఉండడంతో శుక్రవారం మున్సిపల్ కమిషన్ నర్సయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను బకాయి ఉన్న స్కూల్స్, కాలేజీలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్ల యజమానులు బకాయిలు చెల్లించకపోతే సీజ్ చేస్తామన్నారు. మార్చి 31లోగా ఆస్తి పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఆయన వెంట మేనేజర్ ప్రభాకర్, సర్వర్, శ్రీనివాస్, శశిప్రీతం, గంగాధర్, వెంకటేశ్, శ్రవణ్ ఉన్నారు.


చేర్యాలలో శ్రీ చైతన్య స్కూల్‌కు తాళం వేసిన మున్సిపల్ అధికారులు


చేగుంట: అమ్మవారికి ఒడిబియ్యం పోస్తున్న మహిళలు


రామాయంపేటలో ర్యాలీగా వస్తున్న పెద్దమ్మ బోనాలు


## ఘనంగా పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం

రామాయంపేట, మార్చి 29: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం పెద్దమ్మ, పెద్దిరాజు కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఆలయంలో పట్నాలు వేసి, మొక్కులు తీర్చుకున్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తెచ్చి, అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**అనంతసాగర్‌లో..**

చేగుంట, మార్చి 29: చేగుంట మండలం అనంతసాగర్‌లో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మపెద్దిరాజు కల్యాణోత్సవం, హోమాలు, అన్నదానం చేశారు. అమ్మవారికి బోనాలు తీశారు. ఉత్సవాల్లో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, భిక్షపతి, దుర్గయ్య, స్వామి, సిద్ధిరాములు, యాట స్వామి, శ్రీను, మాజీ సర్పంచ్ లక్ష్మీసిద్ధిరాములు, సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## రాజకీయాల్లో విలువలు పాటించాలి


రామాయంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


రామాయంపేట, మార్చి 29: రాజకీయ నాయకులు విలువలు పాటించాలని, ఎదుటివారిని విమర్శించే విషయంలో విజ్ఞత పాటించాలని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు అన్నారు. శుక్రవారం రామాయంపేట సీహెచ్ ఎస్‌బీ కాంప్లెక్స్‌లో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివప్రసాద్‌రావు, ఎంపీటీసీ నాగులు, నాయకులు అశోక్, దామోదర్, అక్షయ్, విప్లవ్, చింతల స్వామి, గొల్ప్రర్తి యాదగిరి, కుమార్‌సాగర్, హన్మంతరావు, స్వామి, రాము, పరశురాములు ఉన్నారు.

## ఘనంగా గుడ్‌ఫ్రైడే

చిన్నశంకరంపేట, మార్చి 29: మండలంలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే భాగంగా చర్చిలకు వెళ్లి, ప్రార్థనలు చేశారు. చర్చిల్లో క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు. చర్చి ప్రాంగణమంతా యేసు పాటలతో మార్మోగింది.

### నాచగిరిలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వర్గల్, మార్చి 29: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను శుక్రవారం రాత్రి పీఠాధిపతి మధుసూదనందస్వామి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 10:30 గంటలకు లక్ష్మీ సమేత నృసింహ్మాస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ఈవో అన్నపూర్ణ, వేదపండితులు, ఎంపీటీసీ వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు

### సుతారిపల్లిలో చలివేంద్రం ఏర్పాటు

రామాయంపేట మండలం సుతారిపల్లి గ్రామంలో కార్యదర్శి పద్మ ఆదేశాలతో గ్రామస్తులు శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- రామాయంపేట, మార్చి 29



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, METRI SANTU, S/o. Metri Chandranna (Old Name), R/o. H.No. 2-63, Basanthpur (V), Nyalkal (M), Sangareddy Dist., T.S. I Changed My former Name of METRI SANTU, S/o. Metri Chandranna to GOLLA SANTHOSH KUMAR, S/o. Golla Chandrappa (New Name) for future purposes.
NT-313843

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.